క్లుప్తంగా

దళితుడిపై దాడి హేయమైన చర్య

యాలాల: దేవనూరు గ్రామానికి చెందిన దళిత యువకుడు మెట్లి నరేష్‌పై శివ భక్తులు దాడి చేయడం హేయమైన చర్య అని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి అన్నారు. శనివారం దేవనూరులో సావిత్రి బాయిపూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన, రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవిందు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటయ్య, మొగిలి, రమేష్, కృష్ణ తదితరులతో కలిసి గ్రామంలో పర్యటించారు. మాల ముసుగులో దళిత యువకుడిపై దాడి చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

తాండూరు టౌన్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ శివరామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలను కొనసాగిస్తున్నామని, గతంలో పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న బ్యాంకు భవనాన్ని అంబేడ్కర్ చౌక్ సమీపంలోని జగదాంబ టవర్స్‌లోని మొదటి అంతస్తులోకి మార్చామని తెలిపారు. ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

జీవితంలో విద్యార్థిదశ కీలకం



వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు

కుల్కచర్ల: ప్రతి వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేక అధికారి దేవి అన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వరాదని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా బాలికల చదువుతో కుటుంబాలు అభివృద్ధిపథంలో ముందుకు సాగుతాయని, విద్యార్థినులు దృఢమైన సంకల్పంతో చదువుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు.

'అక్షయపాత్ర' అమోఘం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సర్పంచు తదితరులు

మోమిన్‌పేట: అక్షయపాత్ర భోజనం విద్యార్థులకు అనుగుణంగా ఉందని సర్పంచు అంగేరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అక్షయపాత్ర భోజనం వడ్డించి మాట్లాడారు. గతంలో ఏజెన్సీ వారు వండి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా వడ్డించేవారని, ధరలు పెరగడం వలన వారు సరైన భోజనం అందించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం సమయానికి అక్షయపాత్ర భోజనం వడ్డించడం బాగుందని, మండలంలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం వడ్డిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మునీర్ అహ్మద్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, అక్షయ పాత్ర, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

హద్దుమీరితే వాహనాలను సీజ్‌చేస్తాం

ఎస్ఐ విజయ్‌ప్రకాశ్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ విజయ్‌ప్రకాశ్

మోమిన్‌పేట: నిబంధనల ప్రకారం ప్రయాణికులను చేరవేయాలని, హద్దుమీరితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ విజయ్‌ప్రకాశ్ వాహనదారులను హెచ్చరించారు. శనివారం మోమిన్‌పేటలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే కేసు నమోదు చేసి, సీజ్ చేస్తామన్నారు. అంతే కాకుండా మైనర్లు వాహనం నడిపితే అతనితో పాటు యజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలో రాంగ్‌రూట్‌లో వెళ్లినా, స్పీడుగా, త్రిబుల్ రైడింగ్ చేసినా కేసు నమోదు చేస్తామని చెప్పారు. వాహనాలపై పెండింగ్ చలానాలు ఉంటే వెంటనే చెల్లించాలని ఎస్ఐ సూచించారు. ఆటోలు, ట్రాక్టర్లు, ట్రాలీలలో లౌడు స్పీకర్లు పెడితే చర్యలు తప్పవన్నారు. ప్రతి వాహనదారుడు విధిగా లైసెన్స్, ఆర్సీ, బీమా కలిగి ఉండాలని ఎస్ఐ వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించని సమీక్షలెందుకు?

- ప్రజా అవసరాలు పట్టించుకోని అధికారులు
- సంతకాలకోసమే మీటింగులా?
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం



సభలో అధికారులను నిలదీస్తున్న సర్పంచులు

నవాబుపేట: ప్రజా సమస్యలు పరిష్కరించనప్పుడు ఇలాంటి సమావేశాలెందుకు? కేవలం సంతకాల కోసమే సమావేశాలా అంటూ అధికారులపై సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కాలె భవాని అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం ఆద్యంతం వాడీవేడిగా సాగింది. మండల పశువైద్యాధికారి సభకు రాక.. ఆయన అసిస్టెంటును పంపడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత మంది మండల స్థాయి అధికారులు వచ్చారు. ఎవరెవరు రాలేదని అడగడంతో.. కొన్ని శాఖల అధికారులు రాలేదని ఎంపీడీఓ చెప్పారు. దీంతో తీవ్రంగా స్పందించిన సర్పంచులు, ఎంపీటీసీలు మూడు నెలలకు ఒకసారి జరిగే సభకు రాని అధికారులు, గ్రామాల్లోకి ఎలా వెళతారు? ప్రజా సమస్యలు ఎలా పరిష్కరిస్తారని మండిపడ్డారు. సభలో చర్చకు వచ్చిన ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదని, అలాంటప్పుడు ఈ సభలు, సమావేశాలెందుకని ప్రశ్నించారు. చాలా మంది రైతులకు రైతుబంధు రావడం లేదని సభ్యులు సభదృష్టికి తెచ్చారు. చిట్టిగిద్ద ఉర్దు మీడియం పాఠశాలలో తెలుగు మీడియం టీచర్‌ను ఎలా నియమిస్తారని ఎంపీటీసీ ఎక్బాల్ నిలదీశారు. అంగన్‌వాడీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుందని, ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని సభ్యులు ఆరోపించారు.

అప్పు చేసి జీపీలను నడుపుతున్నాం

'ఎనమిది నెలలుగా గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు రావడం లేదు. వారు ఎలా పనిచేస్తారు. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వరు. వేతనాలు లేవు. అప్పులు చేసి జీపీలను నడుపుతున్నాము' అని పలువురు సర్పంచులు వాపోయారు. దీనికి స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ నుంచి డబ్బులు రావడంలో ఆలస్యమవుతుందని సభ్యులకు నచ్చజెప్పారు. రోజుల తరబడిగా విద్యుత్ సమస్యలు చెబుతున్నా.. పట్టించుకునే నాథుడే లేరని, ఫోన్ చేసినా ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించే వరకు గ్రామాల్లో కరెంటు బిల్లులు వసూలు చేయవద్దని అధికారులను హెచ్చరించారు. దీంతో స్పందించిన ఏఈ.. త్వరలోనే గ్రామాల్లోకి వచ్చి సమస్యలు పరిశీలించి, పరిష్కరిస్తామని హామీఇచ్చారు. పలు గ్రామాల్లో మిషన్‌భగీరథ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, పైపులైన్లు, సీసీరోడ్లు వేయడం లేదని ఆరోపించారు. వచ్చే జనరల్‌బాడి మీటింగుకు మండల స్థాయి అధికారులు అందరూ వస్తేనే సమావేశం నిర్వహించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, వైద్యాధికారి రోహిత్, ఏఓ ప్రసన్న, ఎంఈఓ గోపాల్, సర్పంచులు వెంకట్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, రత్నం, బాలమణి, విమలమ్మ, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు విజయ్‌కుమార్, దయాకర్‌రెడ్డి, ఎక్బాల్, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన మొక్కలకు ప్రాణం!



మొక్కలు నాటుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'హరిత హననం' అనే శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి శనివారం ఎంపీడీఓ చంద్రశేఖర్ స్పందించారు. మండల పరిషత్ ఆవరణలో షెడ్డు కింద ఎండుముఖం పట్టిన మొక్కలను కార్యాలయం చుట్టూ నాటించారు.

కొత్త నంబర్‌ను సంప్రదించాలి

కొడంగల్ రూరల్: కొడంగల్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఫోన్ నంబర్ (ఎస్‌హెచ్‌ఓ) 94409 04761నుంచి 87126 70045కు మార్చబడిందని ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియాతో పాటు ప్రజలు మారిన నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను వివరించాలని తెలిపారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల అభ్యున్నతికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గడిసింగాపూర్, రూప్‌ఖాన్‌పేట్, మిట్టకోడూర్, సుల్తాన్‌పూర్, నస్కల్ గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పది విద్యార్థులకు బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడి మెటీరియల్, గైడ్స్ పంపిణీ చేసి మాట్లాడారు. సర్కారు బడుల్లో అన్ని రకాల సౌకర్యాలను మనఊరు–మనబడితో కార్పొరేట్ పాఠశాలల కన్నా.. మెరుగైన వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని, విద్యార్థులు బాగా చదువుకొని పరీక్షల్లో ప్రతిభ చూపాలని సూచించారు. కార్యక్రమంలో గండీడ్ పీఏసీఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, భాస్కర్‌గుప్తా, పలువురు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



సదానందరెడ్డిని సన్మానిస్తున్న భాజపా నేతలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

బొంరాస్‌పేట: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం దుద్యాల మండలంలో పార్టీ నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కలిగే రాములును నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరిస్తూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం పార్టీ శ్రేణులు సదానందరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు హన్మంతు, కార్యదర్శులు బాబయ్య నాయుడు, చంద్రప్ప, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత, తాలూక కన్వినర్ నర్సింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో వసూలు చేయండి

డీఎల్‌పీఓ అనిత



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అనిత

మోమిన్‌పేట: పంచాయతీల్లో పన్నులు సకాలంలో వసూలు చేయాలని డీఎల్‌పీఓ అనిత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పంచాయతీల్లో 100శాతం పన్నులు వసూలు చేయాలని, నిధుల లేమితో కొట్టు మిట్టాడుతున్న జీపీలకు పన్నుల వసూలు తప్పనిసరని చెప్పారు. వసూళ్లలో నిర్లక్ష్యం తగదని, కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో ప్రతి 10రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని, సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా పని చేయాలని సూచించారు. పల్లెప్రగతి పనులను రోజు చేయాలని, హరితహారంలో నాటిన మొక్కలకు నీటిని అందించాలని ఆమె ఆదేశించారు. నర్సరీల్లో విత్తనాలు నాటి, నీటిని అందిస్తేనే మొలకలు వస్తాయని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఆధార్‌కు ఫోన్ నంబర్ లింకు సరికాదు

ధారూరు: విద్యార్థుల ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్ అనుసంధానం చేయడం సరికాదని ధారూరు మండల పీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవోదయ ప్రవేశ పరీక్ష ద్వారా 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని, ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్లు లింక్ తప్పనిసరి చేయడం వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. చిన్నప్పుడు ఆధార్‌కార్డులో విద్యార్థుల వేలిముద్రలు నమోదు కాకపోవడంతో వేలిముద్రలను అప్‌డేట్ చేయడానికి ఆధార్ కేంద్రంలో కొన్ని రోజుల సమయం పడుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల వద్ద కాని, వారి తల్లిదండ్రుల వద్ద కాని స్మార్ట్ ఫోన్ సౌకర్యం కూడా లేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింకు నిబంధనను తొలగించాలని సంబంధిత అధికారులను కోరారు.

వైభవంగా సంగమేశ్వర ఉత్సవాలు

- ధ్వజారోహణం ప్రారంభించిన సర్పంచ్
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: శివ నామస్మరణతో కనకమామిడి సంగమేశ్వర దేవాలయ ప్రాంగణం మార్మోగింది. సంగమేశ్వర స్వామి మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం మొదటి రోజు రుద్రహోమం, విఘ్నేశ్వర స్వామి పూజ వేదపండితులు నిర్వహించి స్వామివారి మహోత్సవ కార్యక్రమాలను ధ్వజారోహణంతో ప్రారంభించారు. ఈ ధ్వజారోహణ పతాక, పూలమాల ఆవిష్కరణలో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి పాల్గొని పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా వేదపండితులు, ఆలయ పూజారులు రుద్రాభిషేకం పూజలు చేశారు. శివలింగానికి, శివపార్వతులకు మహామంగళ హారతి సమర్పించి నైవేద్యాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు మహా మంగళహారతి, స్వామి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సంగమేశ్వర దేవాలయం భక్తులతో కిటకిటలాడుతూ శివనామ స్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభావతిగణేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్, అంజిరెడ్డి, పద్మనాభం, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, వేదపండితులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

యువత న్యాయవిద్యను అభ్యసించాలి

- పరిస్థితులు అనుకూలమైతే ఎక్కువ పనిచేయగలం
- హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని



బార్ అసోసియేషన్ నూతనభవనాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి ప్రియదర్శిని

పరిగి: పరిస్థితులు అనుకూలంగా ఉంటే.. మరింత పని ఎక్కువ చేయగలమని హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని అన్నారు. పట్టణ కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బార్‌అసోసియేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, యువత డాక్టర్, ఇంజినీర్ విద్యనే కాకుండా.. న్యాయవిద్యను కూడా అభ్యసించాలని సూచించారు. పని ఒత్తిడి ఉంటుందన్న కారణంతో చాలా మంది న్యాయవాద వృత్తిని ఎంచుకోవడం లేదని, లా చదివితే దేవాలయాల్లాంటి న్యాయస్థానంలో ప్రజలకు సేవచేసే భాగ్యం లభిస్తుందని న్యాయమూర్తి చెప్పారు. పరిగి కోర్టులో దాదాపుగా 2,500 కేసులు పెండింగులో ఉన్నాయని, ఈ కేసులన్నీ ఒక్క న్యాయధికారి మాత్రమే పరిష్కరించలేరని, కావున అందరూ కలసికట్టుగా వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు.

విద్యార్థి దశ కీలకం..

రెండు నెలలకు ఒకసారి లోక్ అదాలత్‌ను నిర్వహిస్తుంటామని, అందులో ఇరు పక్షాలను ఒప్పించి రాజీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఆ దశలోనే విద్యార్థి భవిష్యత్తును బేరీజు చేసుకోవచ్చునని ఆమె చెప్పారు. ఇష్టపడి చదవి, ఇష్టమైన రంగాన్ని ఎంచుకుంటే అనుకున్న లక్ష్యాలను త్వరగా చేరుకోవచ్చని తెలిపారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగాన్ని తప్పకుండా చదవాలని సూచించారు. బెంచ్ అండ్ బార్ అసోసియేషన్లు రిలేషన్‌షిప్‌తో సలహాలు, సూచనలు అందిపుచ్చుకోవాలన్నారు. పరిగిలో అడిషనల్ కోర్టు తదితర సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి సుదర్శన్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ శీతల్, వికారాబాద్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, పరిగి జూనియర్ జడ్జి హరికుమార్, అడిషనల్ ఎస్పీ మురళీధర్‌రావు, పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టును సందర్శించిన న్యాయమూర్తి

ధారూరు: ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టును హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని సకుటుంబ సమేతంగా సందర్శించారు. జిల్లా కోర్టు న్యాయమూర్తి డీబీ శీతల్‌తో కలిసి ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను, అడవి అందాలను వీక్షించారు. అనంతరం లాంచ్‌బోట్‌లో ప్రాజెక్టు నీటిలో విహరించారు.

పద్మనాభ సన్నిధిలో..

వికారాబాద్ అర్బన్: హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని శనివారం ఉదయం అనంతగిరిలోని శ్రీ అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమం అనంతరం ఆమెకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

ఘనంగా మహాపడి పూజ

దోమ: దొంగ ఎన్కేపల్లి గ్రామంలో శివస్వాముల మహాపడి పూజ శనివారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన శివ భక్తుడు పిల్లి వెంకటయ్య తన నివాసంలో పలు గ్రామాల శివ భక్తులు, గ్రామస్తులతో కలిసి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ముందుగా శివభక్తులు శివుడికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేసిన అనంతరం రకరకాల పూలు, పండ్లతో అలంకరించి, పంచహారతులను సమర్పించారు. అనంతరం పడిమెట్లపై పన్నెండు జ్యోతిర్లింగాలకు కర్పూరంతో జ్యోతులను వెలిగించారు. కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంలాల్, గ్రామస్తులు సంజీవ్‌కుమార్, వెంకటేశ్, మొగులయ్య, శివకుమార్ గౌడ్, గోపాల్, సాయిబాబు, అనంతయ్య, శ్రీనివాస్, అనిల్‌కుమార్, నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడి నియామకం



శ్రావణ్‌కుమార్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

తాండూరు: తాండూరు మండల బీసీ సంఘం అధ్యక్షుడిగా మంబాపూర్ సర్పంచ్ శ్రావణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను ఆ సంఘం నియోజకవర్గ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ కన్వినర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రావణ్‌కుమార్‌ను మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులున్నారు.

లేగదూడలకు బ్రూసెల్లా టీకాలు

షాబాద్: లేగదూడలకు బ్రూసెల్లా టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. శనివారం మండల పరిధిలోని కేశవగూడ, ఎల్గొండగూడ, ముద్దెంగూడ, మల్లారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి గ్రామాల్లో సిబ్బందితో కలిసి లేగదూడలకు బ్రూసెల్లా టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల రైతుల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో 156 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న సాంబమూర్తి, ట్రాఫిక్ సీఐ వాసు, బాధితులు

చేవెళ్ల: ట్రాఫిక్ కేసులపై చేవెళ్లలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో శనివారం మూడవ రోజు 156 కేసులు పరిష్కరించినట్లు రిటైర్డ్ జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసులకు పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహన దారులు కేసులు పరిష్కరించుకునేందుకు ఈ లోక్ అదాలత్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 156 కేసులు పరిష్కరించి, వారికి రూ. 3లక్షల 81వేల జరిమానా విధించినట్లు చెప్పారు. ఇంకా కొన్ని రోజుల పాటు లోక్ అదాలత్ కొనసాగుతుందని, సంబంధిత కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరికైనా సమాచారం లేకపోయినా వారు నేరుగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసులు తెలుసుకొని పరిష్కరించుకోవాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వాసు తెలిపారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడతాం

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

షాబాద్: ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగడతామని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ సందిపని కన్వీనర్ బర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఏబీవీపీ సమ్మేళనం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) శంషాబాద్ జిల్లా సమ్మేళనం ఈ నెల 6న ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ వాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, వావదీష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు



ఆలయం వద్ద భక్తజనం

దోమ: మండల కేంద్రంలోని ఉదన్‌రావుపల్లి గ్రామ సమీపంలో ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకలకు ఆలయ చైర్మన్ మాలి రాంచంద్రారెడ్డి, వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు కావడంతో అమ్మవారిని ఆలయం చుట్టూ గవ్వల బండారు చల్లుతూ ప్రదక్షిణలు చేయించారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.